# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ముస్లింలు, నాయకులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ఓల్డ్‌బోయిన్‌పల్లి:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి హఫీజ్ పేట్‌లోని మదర్సా సిరాజుల్ ఉలూంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని మదర్సాలో కరెంట్ బిల్లు కట్టలేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కార్పొరేటర్ ద్వారా తెలుసుకొని సమస్యను పరిష్కరిస్తానని చెప్పానన్నారు. ఈ మేరకు విద్యార్థులు కరెంట్ కష్టాలు పడకుండా రూ. 26 లక్షలతో సోలార్ పవర్ ప్లాంట్‌ని ప్రారంభించినట్లు తెలిపారు. నిరుపేద ప్రజలకు ఎటువంటి కష్టాలు వచ్చినా తాను అండగా ఉంటానని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనను సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, మౌలానా ఖలీద్, సాబీర్, మార్గుబ్ అలం, నరేందర్ గౌడ్, గౌసుద్దీన్, ఇర్ఫాన్, సయ్యద్ సాహెబ్, హోమర్, బాబా, విజయ్, హరినాథ్, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులతో పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లో పరిధిలో బుధవారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 173 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశామని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డలకు అన్నలాగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ప్రసాద్, లక్ష్మీ నారాయణ, కాశినాథ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, ఎల్లం నాయుడు, అష్రాఫ్, పోశెట్టి గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు, నాయకులు

### హుడాపార్కును ప్రారంభించండి

**ఆల్విన్‌కాలనీ:** పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన హుడా పార్కు దాదాపు పూర్తి అయినందున త్వరగా ప్రారంభించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మీ నారాయణ, చర్ల రామకృష్ణారెడ్డి, మాయ రాజయ్య, సింగిరెడ్డి, భూపాల్ రెడ్డి, అబ్బులు, గోపాల్‌రెడ్డి, బాల నర్సయ్య, మహేందర్‌రెడ్డి, అశోక్, కనకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సోలార్‌తో తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్

**మోతీనగర్:** సోలార్ సిస్టం విద్యుత్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ని ఉపయోగించుకోవచ్చని విద్యుత్ శాఖ ఎర్రగడ్డ సెక్టార్ ఎలక్ట్రిసిటీ ఏఈ మానస అన్నారు. మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటకు చెందిన స్పోర్ట్స్ ప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్ సిస్టంను బుధవారం మాజీ కౌన్సిలర్ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టడంతో దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, మాజీ అధ్యక్షులు గార్లపాటి మోహన్‌రెడ్డి, నాయకులు రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సోలార్‌ప్యానల్ సిస్టంను ప్రారంభిస్తున్న ఏఈ మానస

# డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

**మోతీనగర్:** మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 'పొంగి పొర్లుతున్న డ్రైనేజీ' శీర్షికతో బుధవారం కూకట్‌పల్లి 'సాక్షి' జోన్ పేజీలో ప్రచురితమైంది. దీంతో సంబంధిత మూసాపేట జల మండలి మేనేజర్ విలియం ప్రకాష్ స్పందించి.. పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, జలమండలి మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చేయాలని వినతి

**మేడ్చల్:** మేడ్చల్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో నిలిపేలా తగు ఆదేశాలు ఇవ్వాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కోరుతూ.. మంత్రికి ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలను వెంటనే పూర్తి చేయించాలని, కరోనా సమయంలో జర్నలిస్టులకు నిలిపివేసిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. మేడ్చల్ స్టేషన్‌లో కృష్ణ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం, నర్సాపూర్, దేవగిరి, జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మేడ్చల్‌లో నిలపాలని కోరారు. మేడ్చల్ పరిధిలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లిలో నిర్మిస్తున్న ఆర్‌యూబీల పనులు మెల్లగా నడుస్తున్నాయని, త్వరగా పూర్తి చేయించాలని కోరారు. మేడ్చల్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–ఘట్‌కేసర్ రూట్ల మధ్య ఎంఎంటీఎస్ ట్రైన్‌ల సంఖ్య పెంచాలని, సమయపాలన పాటించేలా చూడాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ ఈటల రాజేందర్ కోరారు.





# అవినీతి తిమింగలాలు!

- టౌన్‌ప్లానింగ్, జీపీల్లో చేతివాటం ప్రదర్శిస్తున్న పలువురు ఉద్యోగులు
- పురపాలక సంఘాలు, పంచాయతీల్లో అక్రమ కట్టడాల జోరు
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- జీహెచ్ఎంసీ సర్కిళ్లలోనూ పార్కుల కబ్జా
- అటకెక్కిన పర్యవేక్షణతో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ నిర్మాణాలు

నగర శివారు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలన్న విషయాన్ని ఆయా ఇళ్ల యజమానులు మర్చిపోతున్నారు. పైగా ఇంటికి ఆనుకుని కొత్త భవన నిర్మాణాలు చేపడుతున్నారు. భవిష్యత్‌లో జరగరాని ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులనే విషయాన్ని కూడా ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

– సాక్షి,సిటీబ్యూరో

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనతో...

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)దరఖాస్తుల విచారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలు క్షేత్ర స్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టాయి. మేడ్చల్ జిల్లాలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ కట్టడాలు, లేఅవుట్లతోపాటు రోడ్లు, పార్కులను కబ్జా చేసి నిర్మిస్తున్న భవనాలు, బహుళ అంతస్తులు, ఇండిపెండెంట్ ఇళ్లు వెలుగులోకి వస్తున్నాయి. పనుల ఒత్తిడి, పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించకపోవటంతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### పెద్ద మొత్తంలో వసూళ్లు

నిర్మాణదారుల నుంచి అడ్డగోలుగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అక్రమంగా వసూలు చేస్తున్న అమ్యామ్యాలను పర్సెంటేజీల రూపంలో టౌన్‌ప్లానింగ్, ఎంపీఓలు నుంచి మొదలుకొని పురపాలక, పంచాయతీ శాఖ అధికారుల వరకు వెళ్తున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వెంచర్లలో ఎకరానికి రూ. లక్ష నుంచి ఏరియాను బట్టి రూ.3 లక్షల వరకు పలువురు ఉద్యోగులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

### అక్రమ నిర్మాణాలు.. మచ్చుకు కొన్ని..

శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాల పరిధిలోని లింగాపూర్ తండా, లక్ష్మాపూర్, మజీద్‌పూర్, దేవరయాంజల్, కోల్తూర్ తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్, అక్రమ వెంచర్లు వెలిసినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్‌లో ప్రతీ రోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతూనే ఉన్నాయి. పురపాలికల్లో ఇటీవల విలీనమైన గ్రామ పంచాయతీలతో పాటు ప్రస్తుత జీపీల్లో కూడా అక్రమ కట్టడాలు, లే అవుట్లు కొనసాగుతున్నాయి. శామీర్‌పేట్, బొమ్మరాసిపేట, మూడుచింతలపల్లి, తుర్కపల్లి, బాబాగూడ, అంకిరెడ్డిపల్లి, భోగారం, కీసర, చీర్యాల, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, యాద్గార్పల్లి, అలియాబాద్, లింగాపూర్ తండా, చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం, నూతనకల్లు, రాయిల్పూర్, సైదోనిగడ్డ తండాలలో పెద్ద ఎత్తున అక్రమ కట్టడాలు, లేఅవుట్లు నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు.

**సర్కిళ్ల పరిధిలోనూ..**

జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలో కూడా పార్కులు, రోడ్లు ఆక్రమించి అక్రమ కట్టడాలు వెలిసినట్లు గుర్తించారు. జిల్లాలోని ఉప్పల్ సర్కిల్‌లో 1989 చదరపు గజాలు, కాప్రా సర్కిల్‌లో 194 చదరపు గజాలు, మల్కాజిగిరి సర్కిల్‌లో 36 చదరపు గజాలు, మూసాపేట్‌లో 20, కూకట్‌పల్లిలో 455, కుత్బుల్లాపూర్‌లో 62, గాజుల రామారంలో 198 , అల్వాల్ సర్కిల్‌లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలపై యంత్రాంగం సీరియస్‌గా ఉన్నా దందా మాత్రం ఆగడం లేదు.

### గుర్తించిన అక్రమ కట్టడాలివే

మేడ్చల్ జిల్లాలో గతంలో గుర్తించిన అక్రమ కట్టడాల వివరాలు పురపాలక సంఘాల వారిగా ఇలా ఉన్నాయి. నాగారంలో 12 అక్రమ లేఅవుట్లు, బోడుప్పల్‌లో 107, పీర్జాదిగూడలో 67, దమ్మాయిగూడలో ఏడు, మేడ్చల్‌లో 10, నిజాంపేట్‌లో 20, కొంపెల్లిలో 11, దుండిగల్‌లో 12,, తూముకుంటలో 15, పోచారంలో 12, ఘట్కేసర్‌లో 8, కీసర మండలంలో 265, శామీర్‌పేట్‌లో 185, మేడ్చల్లో 72, ఘట్ కేసర్‌లో 67, ఎంసీపల్లి మండలంలో 89 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు.

## ఆలయంలో అన్నదానం



**ఆల్విన్‌కాలనీ:** కార్తీక మాసం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్‌లోని రాజరాజేశ్వరి సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మారెళ్ల శ్రీనివాసరావు, మారెళ్ల హిమబిందు, వాస్తు సిద్ధాంతి సురేష్ వశిష్ట, నీలం సత్యనారాయణ, ఎం రాజా, దేవి సుజాత, వసంత, రవి, రామారావు, హరినాథ్ గౌడ్, శివ, రెహమాన్, వాసు, సంగమేష్ తదితరుల పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహాపడిపూజ



**ఆల్విన్‌కాలనీ:** బాలాజీనగర్‌లోని సాయి ఆటోమొబైల్ అండ్ మోటార్స్ కోట రవీందర్, కోట సాయిచంద్ గురుస్వాములు అయ్యప్ప స్వామి మహా పడి పూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి, రంజిత్ తంత్రిక్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వృత్తిపరమైన శిక్షణ అవసరం

మనూ వీసీ ప్రొ.ఐనుల్ హసన్

**రాయదుర్గం:** ప్రభావవంతమైన విద్యా విషయాలను రూపొందించడంలో వృత్తిపరమైన శిక్షణ అవసరమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ న్యూస్ బులిటిన్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఐఎంసీ డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో నాణ్యమైన విద్య అవసరమన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ఐఎంసీలో నిర్మాత-1 ముజాహిద్ అలీ, డాక్టర్ అస్లామ్ పర్వేజ్, డాక్టర్ ముస్తఫా అలీ సర్వరీ, ఎండీ అమీర్ బాదర్‌లు న్యూస్ రైటింగ్, ఎడిటింగ్, ప్రొడక్షన్ గురించి వివరించారు. అనంతరం మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భరత్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

**మూసాపేట:** ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భరత్‌నగర్ కాలనీలో ఎప్పటికప్పుడు వీధులను శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఐజీలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ శంకర్, ఏఈ రాధాకృష్ణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జమీల్, నాయకులు సుదర్శన్ రెడ్డి, విజయ్‌కుమార్, వేణు, సాంబశివరెడ్డి, సోమయ్య, ఉమావతి, జ్యోతి, శ్రీను, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ట్రంక్ సీవరేజ్ పైపులైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

**కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ డివిజన్‌లోని 7వ ఫేజ్ వద్ద ఎస్టీపీ ప్లాంట్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న ట్రంక్ సీవరేజ్ పైపులైన్ పనులను బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఇప్పటికే అనేక రోడ్లు, పార్కులు, శ్మశాన వాటికలు, నూతన పైపులైన్ నిర్మాణాలు పూర్తి చేస్తున్నామని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎం ప్రభాకర్‌రావు, డీసీఎం సంశీర్, టీఎస్ ట్రాన్స్‌కో శ్రీనివాస్, డీఈ శ్రీదేవి, ఏఈ సాయి ప్రసాద్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా అంతర్గత రోడ్లు

డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన వైనం

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 జలకన్య సెంటర్ పార్కు సమీపంలోని అంతర్గత వీధుల్లో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. సుమారు ఆరు నెలల క్రితం డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్వి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎన్నికలకు ముందు కాలనీలోని రహదారులన్నీ నిర్మించి ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికారు. కానీ అమలు పరిచిన దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మించిన కొద్ది రోజులకే తవ్విన ప్రదేశాల్లో ప్యాచ్ వర్క్ పనులు చేయాల్సి ఉంటుంది. అధికారుల సమన్వయ లోపం వల్ల సమస్య పరిష్కారం కాలేదు. స్కూల్ బస్సులు, ఆటోలు కూడా ఈ రహదారుల్లో రావడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీలో పర్యటించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.









పార్కు సమీపంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లు

## రైతు పండుగను విజయవంతం చేయాలి

**సాక్షి,సిటీబ్యూరో:** ప్రజాపాలనా–ప్రజా విజయోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు జరిగే రైతు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ రైతు పండగ కార్యక్రమానికి ఈ నెల 29న మేడ్చల్ జిల్లా నుంచి 200 మంది రైతులను బస్సుల్లో తీసుకెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతు పండుగ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో రైతులు తిలకించేందుకు వివిధ కంపెనీల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వ్యవసాయ పంటల సాగు తదితర అంశాలపై వర్క్ షాప్, శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్ఠులు ఉంటాయన్నారు.

## పతకాలు సాధించిన బాడీ బిల్డర్లకు సన్మానం



బాడీ బిల్డర్లను అభినందిస్తున్న రాజేశ్వరరావు తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** పవర్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన పంకజ్‌కుమార్ మౌర్య, బి. రంజిత్ బాడీ బిల్డర్లు థాయిలాండ్‌లో నిర్వహించిన 2024 మిస్టర్ వరల్డ్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించారు. 70 కిలోల కేటగిరిలో స్వర్ణ పతకం సాధించిన పంకజ్ కుమార్ మౌర్య, 60 కిలోల కేటగిరిలో కాంస్య పతకం సాధించిన బి. రంజిత్‌లను వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రైనింగ్ కోచ్ మహ్మద్ జమీర్‌ను అభినందించారు.

## రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**చందానగర్:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డుకు మహర్దశ కలగనుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డులో నూతనంగా చేపట్టిన రోడ్డు పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం లీకేజీలు, గుంతల సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ 7 కిలోమీటర్ల మేర, రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంజీరా రోడ్డుతో పాటు మైత్రీనగర్ ఫేజ్ 3 కాలనీ రోడ్డు పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ స్రవంతి, ఏఈ ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, ఇబ్రహీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

## త్వరలో ఈదులకుంట చెరువు సర్వే

హైడ్రా కమిషనర్ రంగనాథ్



**చందానగర్:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువును శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈదులకుంట చెరువు పునరుద్ధరణ నిమిత్తం పరిశీలించామని తెలిపారు. ఇటీవల ఈదులకుంట చెరువు ఆక్రమణకు గురవుతుందని పలు ఫిర్యాదులు వచ్చాయని, త్వరలోనే వాటి వివరాలు అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. ఖానామెట్ సర్వే నంబర్ 7లో 6.05 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని కబ్జాకు గురవుతుందని ఫిర్యాదుల నేపథ్యంలో త్వరలో సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో హైడ్రా , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఆదిత్య మౌర్య



**మియాపూర్:** బాక్సింగ్ జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మహంకాళి ఆదిత్య మౌర్యను బుధవారం కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఆదిత్య మియాపూర్ శ్రీ వశిష్ఠ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా ఈ నెల 22, 23, 24వ తేదీలలో లాలాగూడలో రైల్వే స్కూల్‌లో జరిగిన పోటీల్లో మహంకాళి ఆదిత్య మౌర్య గోల్డ్ మెడల్ సాధించాడు. డిసెంబర్ 8 నుండి 15 వరకు నోయిడాలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఎంపిక అయ్యాడు.